ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
గురువారం 31 జూలై 2025



మేడిగడ్డలో పత్తి చేను



మంగళపల్లి గ్రామంలో వరి చేను

పంటలకు జీవం..
అన్నదాతల్లో ఆనందం

ఆశలు రేకెత్తిస్తున్న వానాకాలం సీజన్

- విస్తారంగా వర్షాలు
- పచ్చగా కళకళలాడుతున్న చేలు

ఆమనగల్లు, జూలై 30(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌లో సాగు చేసిన పంటలు కళకళలాడుతున్నాయి. ఆమనగల్లు మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు పంటలకు జీవం వచ్చింది. వాటినిచూసి రైతులు మురిసి పోతున్నారు. జొన్న, మొక్కజొన్న, పత్తి, ఆముదం పంటలు ఏపుగా పెరిగాయి. ఈ ఏడాది బోరు బావుల కింద పెద్ద ఎత్తున సాగు చేసిన వరి పంట కూడా పచ్చదనంతో కళకళలాడుతుంది. ఈ సారి పెట్టుబడులకు ఢోకా లేదని కర్షకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో రైతులు క్షణం తీరిక లేకుండా పనులు చేస్తున్నారు. కలుపు తీయడం, ఎరువులు చల్లడంలో నిమగ్నమయ్యారు. కూలీలకూ చేతినిండా పని దొరుకుతుంది. ఆమనగల్లు మండలంలో వానాకాలంలో 9,678 ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. 7,658 ఎకరాలలో పత్తి, 523 ఎకరాలలో జొన్న, 850 ఎకరాలలో మొక్కజొన్న, 35 ఎకరాలలో కందులు, 580 ఎకరాలలో వరి, రెండు ఎకరాలలో ఆముదం పంట సాగు చేశారు. కాగా ఎరువుల కొరత లేకుండా వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. ఏడీఏ శోభారాణి, ఏవో శ్రీనివాస్ గౌడ్ దుకాణాలను సందర్శించి ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్నారు. వర్షాల నేపథ్యంలో చీడ పీడలు, తెగుళ్ల సోకే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు.

మీ ఇంట్లో ఇలాంటివే వండుకుంటారా?

- కేజీబీవీ పాఠశాలలో పాడైన కూరగాయలు
- ఉపాధ్యాయులపై ఎమ్మెల్యే కాలె యాదయ్య సీరియస్



సాంబారును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

శంకర్‌పల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో పాడైన కూరగాయలను చూసిన ఎమ్మెల్యే యాదయ్య ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శంకర్‌పల్లి కేజీబీవీ పాఠశాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదిలో నాణ్యత లేని కూరగాయలను చూసి మండిపడ్డారు. "మీ ఇంట్లో ఇలాంటి వాటినే వండుకుంటారా..?" అంటూ సీరియస్ అయ్యారు. అనంతరం ఆఫీసు గదిలో రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రిన్సిపాల్ మధురవాణి ఎందుకు రాలేదని ఉపాధ్యాయులను ప్రశ్నించగా, లీవ్‌లో ఉందని వారు సమాధానమిచ్చారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్ యోగేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రమోహన్. ప్రవీణ్‌కుమార్, పాండురంగారెడ్డి ఉన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

మొక్కలు నాటి పర్యావరణ హితానికి పాటుపడాలని ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. శంకర్‌పల్లి మున్సిపల్ కార్మికులకు ఆయన బుధవారం రెయిన్‌కోట్‌లు, గ్లౌస్‌లు, ఆప్రాన్‌లు అందజేసి స్వీపింగ్ మిషన్‌ను ప్రారంభించారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కమిషనర్ యోగేష్, అంజన్‌కుమార్, చంద్రమోహన్, వెంకట్‌రాంరెడ్డి. ప్రవీణ్‌కుమార్, చంద్రమౌళి, ప్రకాష్, పాండురంగారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి ఉన్నారు.

తగ్గనున్న దూరం..
తీరనున్న కష్టం!

పశ్చిమ రంగారెడ్డి జిల్లా రైతులకు మంచి రోజులు రాబోతున్నాయి. మెహిదీపట్నం సమీపంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న గుడిమల్కాపూర్ మార్కెట్‌ను మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌కు తరలించేందుకు కసరత్తు మొదలైంది. ఒకేచోట పూలు, పండ్లు, కూరగాయలు విక్రయించేందుకు అనువుగా సమీకృత మార్కెట్‌ను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం తెలంగాణ పోలీస్ అకాడమీ పక్కన 150 ఎకరాలను కేటాయించే ప్రక్రియ సాగుతోంది. 50 ఎకరాల్లో పూల మార్కెట్, 50 ఎకరాల్లో పండ్లు, మరో 50 ఎకరాల్లో కూరగాయల మార్కెట్‌ను నిర్మించనున్నారు. అజీజ్‌నగర్‌లో సమీకృత మార్కెట్ అందుబాటులోకి వస్తే పశ్చిమ రంగారెడ్డి ప్రాంతాలైన వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్, చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్ ప్రాంతాల రైతులకు ప్రయోజనకరంగా ఉండనుంది.

అజీజ్‌నగర్‌కు గుడిమల్కాపూర్ మార్కెట్

- తొలగనున్న రైతుల కష్టాలు
- ఒకేచోట పూలు, పండ్లు, కూరగాయల విక్రయాలు
- ఔటర్ రింగ్‌రోడ్డు పక్కన 150 ఎకరాలు కేటాయింపు
- 50 ఎకరాల చొప్పున మూడు మార్కెట్ల నిర్మాణం



సమీకృత మార్కెట్ నిర్మించనున్న స్థలం ఇదే

రంగారెడ్డి అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పూలు, పండ్లు, కూరగాయ పంటలకు పెట్టింది పేరు పశ్చిమ రంగారెడ్డి జిల్లా. ఇక్కడ పండించే కూరగాయలు హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్‌తో పాటు ఇతర మార్కెట్లకు ఎగుమతి చేస్తున్నారు. చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్ తదితర ప్రాంతాలు క్యారెట్, కూరగాయల సాగుకు పేరుగాంచాయి. ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, బాలాపూర్, ప్రాంతాలు ఆకుకూరలకు, షాద్‌నగర్ పచ్చిమిర్చి సాగుకు ప్రఖ్యాతిగాంచాయి. వికారాబాద్ జిల్లా పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ ప్రాంతాల్లో పండ్లతో పాటు కూరగాయల సాగు అధికంగా ఉంటుంది. ఏటా సుమారు 15 - 20 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉత్పత్తి జరుగుతుంది. ఇందులో 30 శాతం వికారాబాద్, రంగారెడ్డి జిల్లా అవసరాలకు పోగా మిగతా 70శాతం కూరగాయలు హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాలకు

మిగతా 8వ పేజీలో...

సంతోషంగా ఉంది



ఔటర్ రింగ్ రోడ్డు పక్కన పూలు, పండ్లు, కూరగాయల మార్కెట్ ఒకే చోట ఏర్పాటుకు నిర్ణయించడం సంతోషంగా ఉంది. గుడిమల్కాపూర్ మార్కెట్‌ను తరలించి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే యాదయ్యకు రైతులు రుణపడి ఉంటారు. కూరగాయలు, పూలు తీసుకెళ్లేందుకు పడుతున్న ఇబ్బందులు మార్కెట్ నిర్మాణంతో తీరుతాయి.

- పైండ్ల సాయిరెడ్డి, ఇబ్రహీంపల్లి, చేవెళ్ల మండలం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రుణ లక్ష్యాలను పూర్తి చేయాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్/యాచారం, జూలై 30(ఆంధ్రజ్యోతి): రుణాల అందజేతలో వంద శాతం లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ త్రైమాసిక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుణ వితరణలో కొన్ని బ్యాంకులు వెనుకబడ్డాయన్నారు. బ్యాంకర్లు సమీక్షలు నిర్వహించి లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న విద్యా రుణాలపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే వివిధ వర్గాల అభ్యున్నతికి, ఆర్థిక పురోగతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల కింద బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలన్నారు. వీధి వ్యాపారులకు సూక్ష్మరుణాలు త్వరగా మంజూరు చేయాలన్నారు. రుణ గ్రహీతలు యూనిట్లు స్థాపించారా, వారి అభివృద్ధిని నిశితంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలను పూర్తిగా పంపిణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో లీడ్‌బ్యాంక్ మేనేజర్ సుశీల్‌కుమార్, ఆర్‌బీఐ ప్రతినిధి రెహమాన్, నాబార్డు ఏజీఎం అఖిల్, వ్యవసాయాధికారి ఉష ఉద్యానవన శాఖ అధికారి సురేష్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మొయినాబాద్ మండల పరిధిలోని తోల్‌కట్ట పరిధిలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. సీఈసీ, వృత్తి విద్యా కోర్సు ఆఫీస్ అసిస్టెంట్, టూరిజం, హాస్పిటల్ కోర్సుల సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్థులు టెన్త్ మెమో, టీసీ, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఐదు పాస్ ఫొటోలు వెంట తీసుకురావాలని సూచించారు. ఇతర వివరాలకు 8374000562 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

అధ్వానంగా ఆఫీసులు!

అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు

- ఇరుకు గదులు.. వసతులు కరువు
- ఇబ్బందుల్లో సిబ్బంది, ప్రజలు
- దండిగా ఆదాయం ఉన్నా పక్కా భవనాలు నిర్మించరు

ఇబ్రహీంపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లయినా ప్రభుత్వ కార్యాలయాలు నేటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో వేల ఎకరాల ప్రభుత్వ, భూదాన్ భూములున్నా సర్కార్‌కు ఆదాయం తెచ్చే సబ్ రిజిస్ట్రార్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించలేకపోతున్నారు. అరకొర వసతుల మధ్య ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారు. ఏళ్ల తరబడిగా అద్దె భవనాలకే పరిమితమయ్యాయి. ఈ కార్యాలయాలకు వచ్చే జనం ఆరుబయటే ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ కనీస సౌకర్యాలకు దూరంగా ఉంటున్నారు. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు

మిగతా 8వ పేజీలో...



అద్దె భవనంలో ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఇరుకు గదుల్లో ఇబ్బందులు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పక్కా భవనం లేక ఇబ్బంది పడుతున్నాం. ప్రస్తుతం నడుస్తున్న కార్యాలయం ఇరుకుగా ఉండడంతో సమస్యగా ఉంది. వాహనాలు పార్కింగ్ చేయడానికి కూడా స్థలం లేదు. ఈ విషయమై ఉన్నతాధికారులకు మరోమారు ప్రతిపాదనలు పంపుతున్నాం.

- వి.హన్మంత్‌రావు, జాయింట్ సబ్ రిజిస్ట్రార్, ఇబ్రహీంపట్నం



పూజలు చేస్తున్న కేఎల్లార్

పర్యాటక కేంద్రంగా రాజరాజేశ్వరాలయం

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ప్రాచీన కట్టడాలు, చారిత్రాత్మక ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, భవిష్యత్తులో మహేశ్వరం పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వరాలయంలో శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఘన చరిత్ర ఉన్న ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకునేలా సంబంధిత మంత్రి, సీఎంతో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్.యాదయ్య, కాకి ఈశ్వర్, బొక్క జంగారెడ్డి, రాజునాయక్, నడికూడ శివ, లాజర్, జంగయ్య పాల్గొన్నారు.

ప్రతీ పథకాన్ని పేదల గడపకు చేర్చాలి
● ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి 7

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం
● మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి 6

యజ్ఞ యాగాలతో సకల జీవకోటి సుభిక్షం

- మంత్రి కొండా సురేఖ



గోవుకు పూజలు చేస్తున్న మంత్రి కొండా సురేఖ

మహేశ్వరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : యజ్ఞ యాగాలు చేయడం ద్వారా సకల జీవకోటి సుభిక్షంగా ఉంటుందని మంత్రి కొండా సురేఖ అన్నారు. మండల పరిధిలోని గట్టుపల్లిలోని కోర్పోలు చంద్రారెడ్డి రిసార్ట్‌లో మూడు రోజుల పాటు నిర్వహించతలపెట్టిన శతచండీ సమేత రాజశ్యామలా యాగం మొదటి రోజు బుధవారం వేద పండితుల మంత్రోచ్ఛరణలతో వైభవంగా ప్రారంభమైంది. ఈ యాగ ప్రారంభానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. గోపూజ, గణపతి, పుణ్యాహవచనం పూజల్లో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, కోర్పోలు అనంతలక్ష్మి, రాఖేష్‌రెడ్డి, శైలజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రజాపాలన

- బీఆర్ఎస్ పాలనలో అవినీతి అక్రమాలు రాజ్యమేలాయి
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



రేషన్ కార్డు లబ్ధిదారులతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట, జూలై 30(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో అవినీతి అక్రమాలు రాజ్యమేలాయయని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాపాలన కొనసాగుతోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం కేశంపేట మండలంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేశారు. వేములనర్వ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, పుట్టోనిగూడ, సుందరాపురంలో పంచాయతీ భవనం, కొత్తపేటలో ముదిరాజ్ భవనం, కేశంపేటలో ఎస్సీ కమ్యూనిటీ హాల్, అలాగే దివ్యాంగుల పునరావాస కేంద్రానికి శంకుస్థాపన చేశారు. అలాగే తులవానిగడ్డ మహిళా సంఘం భవనం ప్రారంభం, గ్రామానికి 24గంటల విద్యుత్ సౌకర్యాన్ని ప్రారంభించారు. మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ యెన్నం శ్రీధర్ రెడ్డి తన తల్లితండ్రులు యెన్నం పాండురంగారెడ్డి, సుమిత్రమ్మల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభించారు. కేశంపేటలో లబ్ధిదారులకు రేషన్ కార్డుల ప్రొసీడింగ్‌లను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క ఇల్లు ఇవ్వలేదని దుయ్యబట్టారు. సీఎం రేవంత్ సర్కార్‌లో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని తెలిపారు. ఒక్క కేశంపేట మండలానికే 2300 రేషన్ కార్డులు మంజూరు చేశామన్నారు. అనంతరం అల్వాల గ్రామంలో నిర్వహించిన వనమహోత్సవంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. మండల కేంద్రంలోని సీతారామ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఇటీవల నేలకూలిన ధ్వజస్తంభ ప్రదేశాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. అది కూలడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాలలో మండల ప్రత్యేకాధికారి వెంకటరమణ, తహసీల్దార్ అజాంఅలీ, ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య, టాస్కో ఏడీ రవీందర్, ఏఈ. ఈశ్వర్, ఏఎంసీ డైరెక్టర్లు భాస్కర్ గౌడ్, కరుణాకర్, మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు గూడ వీరేశ్, మహిళా అధ్యక్షురాలు రాణి, బ్లాక్ అధ్యక్షుడు జగదీశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

తాండూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువత, రైతులు వ్యవసాయ ఆధారత పరిశ్రమల ద్వారా ఆదాయ వనరులను పెంచుకోవాలని తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సి.సుధాకర్ అన్నారు. బుధవారం పరిశోధన కేంద్రంలో జిల్లా స్థాయి ఎఫ్‌పీఓ డైరెక్టర్లు, రైతులకు

అగ్రి పరిశ్రమలతో ఆదాయం పెంచుకోవాలి



రైతులు, ఎఫ్‌పీఓ డైరెక్టర్లకు శిక్షణనిస్తున్న శాస్త్రవేత్త సుధాకర్

అగ్రి హబ్ తాండూరు లైవ్లీహుడ్ బిజినెస్ ఇంక్యుబేటర్, ఏఎస్‌పీఐఆర్‌ఈఈ సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం నిర్వహించారు. రైతులను వ్యాపారవేత్తలుగాచేసే కార్యక్రమం, వ్యవసాయ రంగంలో వ్యాపారావకాశాలకు తోడ్పాటుపై శిక్షణ ఇచ్చారు. వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థలకు న్యాయకత్వం వహిస్తున్న డైరెక్టర్లు, వ్యాపారాభివృద్ధి, మార్కెట్ లింకేజీలు, సమర్థ వ్యవస్థాపనలపై అవగాహన కలిగి ఉండాలని శాస్త్రవేత్త సూచించారు. వ్యవసాయోత్పత్తులతో వ్యాపారాలను ప్రారంభించేందుకు సదుపాయాల కల్పన, శిక్షణ, మద్దతు విధానాలపై చర్చించారు. మార్కెటింగ్, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాట్లు నెలకొల్పుకోవాలని సూచించారు. టీఆర్‌వీకే కోఆర్డినేటర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయి సమస్యలపై తమ దృష్టికి తేవాలని సూచించారు. ప్రాథమిక వ్యవసాయంలో వ్యాపారావకాశాలు, డిజిటల్ మార్కెటింగ్ సిస్టంపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. ఎఫ్‌పీఓలు మోడళ్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ సి.సుధారాణి, శాస్త్రవేత్తలు యమున, భారతి, స్వాతి పాల్గొన్నారు.


ప్రదర్శించిన మోడళ్లపై వివరిస్తున్న శాస్త్రవేత్తలు

భట్టి సభ సక్సెస్.. కాంగ్రెస్‌లో జోష్


నేతలను గజమాలతో సత్కరించిన కాంగ్రెస్ శ్రేణులు(ఫైల్)

తాండూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుల పర్యటన, సభల సక్సెస్‌తో తాండూరు కాంగ్రెస్ జోష్ నెలకొంది. త్వరలో స్థానిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల కార్యక్రమాల నిర్వహణ, సభకు మహిళలు, యువత తరలిరావడంతో కాంగ్రెస్ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. తాండూరులో ఒక మంచి నాయకుడిని ఎమ్మెల్యేగా ఎనుకున్నారని, మనోహర్‌రెడ్డి ఆరాటం, పోరాటం అంతా తాండూరు నియోజకవర్గం కోసమేనని, ప్రభుత్వం నుంచి భారీగా నిధులు సాధించేందుకు ప్రయత్నిస్తున్నారని అనడం కాంగ్రెస్ నాయకుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఈ ప్రాంత సమస్యలను, స్టోన్‌పాలిషింగ్‌కు సమస్యలపై పరిష్కరిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పడంతో రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారని తేల్చి చెప్పినట్టయింది. తాండూరు మున్సిపాలిటీలో రూ.7.37కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు, ఇతర వర్క్‌ల శంకుస్థాపనలతో ప్రజల్లో అనుకూలత వ్యక్తం అవుతోంది. తాండూరు ప్రాంతంలో కాగ్నానది ఆధానంగా ఎత్తిపోతల పథకాన్ని, నవాంద్గి(బషీరాబాద్)కి 132 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు, 50ట్రాన్స్‌ఫార్మార్ల మంజూరుకు డిప్యూటీ సీఎం ఒప్పుకోవడం కాంగ్రెస్ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహాన్ని నింపింది.

ఆ భూముల్లో జోక్యం చేసుకోవద్దు

● కమిషనర్‌కు హైకోర్టు తాత్కాలిక ఆదేశాలు

తాండూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): తాండూరులోని సాయిపూర్‌లోని సర్వే నంబర్లు 954, 96/యూయూ, 97/లు, 106/ఎల్‌యూ, 107/ఆర్‌యూ ప్లాట్లలో ఎలాంటి జోక్యం చేసుకోవద్దని హైకోర్టు న్యాయమూర్తి బి.విజయషేన్‌రెడ్డి తాండూరు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. తదుపరి విచారణ వరకు ఈ భూముల్లో జోక్యం చేసుకోవద్దని, మొత్తం ఎకర ఏడు గుంటల స్థలం ఉందని ఆర్డర్‌లో పేర్కొన్నారు. కోర్టు ఆర్డర్‌ను మున్సిపల్ కార్యాలయంలో అందజేశామని పిటిషనర్ ఎస్.విజయదేవి, వి.రంగారావు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ తమ ప్లాట్లలో జోక్యం చేసుకుంటున్నారని వారన్నారు. తదుపరి ఉత్తర్వులొచ్చేదాక కమిషనర్, అధికారులు ఎవరూ ఈ స్థలంలోకి రావొద్దని కోర్టు ఆర్డర్‌లో పేర్కొంటూ ఇంటరిమ్ డైరెక్షన్ ఇచ్చారని వారు తెలిపారు. ఈ స్థలాలు ఎస్.విజయదేవి, రంగారావు, స్రుజన్‌ల పేరిట ఉన్నాయని చెప్పారు. ఇదిలా ఉంటే గతంలోనూ ఈ స్థలాల విషయంలో పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు.

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల వైస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, జూలై30(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఘనాపూర్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్‌లో గల విక్టోరియా కళాశాలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదవాలని, అప్పుడే ఎంచుకున్న లక్ష్యాలను చేరుతారని తెలిపారు. పట్టుదలతో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. మెల్బోర్న్‌లోని విక్టోరియా కళాశాలతో భాగస్వామ్యం కుదుర్చుకోవడం అభినందనీయమని తెలిపారు. ఇరు కళాశాలలు విద్యార్థులు భవిష్యత్తుకు ముందడుగు వేయాలని కోరారు. కార్యక్రమంలో విక్టోరియా కళాశాల సీఈవో సూరపనేని అర్జున్, కేపీఆర్‌ఐటీ కళాశాల డైరెక్టర్ సుధీర్‌ప్రేమ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనాథ్ కశ్యప్, డీన్ శ్రీవాస్తవ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'మహా గర్జన'ను విజయవంతం చేయాలి

పెద్దేముల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, పింఛన్‌దారుల మహాగర్జన సన్నాహక సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి స్వామిదాస్ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం జనగాం, మారెపల్లి గ్రామాల్లో దివ్యాంగులు, ఆసరా పింఛన్‌దారులతో సమావేశమయ్యారు. పింఛన్లు రూ.4వేలకు, దివ్యాంగుల పింఛన్లు రూ.6వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 2న కొడంగల్‌లో నిర్వహించే మహాగర్జన సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సభకు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని తెలిపారు.

విధుల పట్ల అలసత్వం వహించొద్దు



సీఐ, ఎస్సైలతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్

కొడంగల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది విధుల పట్ల అలసత్వం వహించకుండా అంకితభావంతో పనిచేయాలని పరిగి డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. బుధవారం కొడంగల్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై జీవీ.సత్యనారాయణతో పెండింగ్ కేసులపై తెలుసుకున్నారు. రానున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో చేపట్టాల్సిన భద్రతాచర్యలపై సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.

పోలీస్ స్టేషన్ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

దుద్యాల: దుద్యాల పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని డీఎస్పీ సూచించారు. దుద్యాలలో చేపడుతున్న పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్పీతో సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై యాదగిరి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

నవాంద్గీ-హల్కోడ రోడ్డుకు మహర్దశ

● రూ.కోటి నిధులతో పనులు షురూ


రోడ్డు పనులను పరిశీలిస్తున్న అజయ్‌ప్రసాద్, తదితరులు

బషీరాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ-కర్ణాటక రాష్ట్రాల మధ్య లింకు రోడ్డుకు మహర్దశ వచ్చింది. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో రోడ్డు నిర్మాణానికి సీఆర్ఆర్ గ్రాంట్ కింద రూ.కోటి మంజూరయ్యాయి. నవాంద్గీ-కర్ణాటక లోని హల్కోడ గ్రామాల మధ్య 1.5కిలోమీటర్ల రోడ్డు పనులు జోరందుకున్నాయి. కాంట్రాక్టర్ రోడ్డు విస్తరణ పనులను ముమ్మరం చేశారు. మొరం పనులు చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం నవాంద్గీ సొసైటీ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ బుధవారం ఈ పనులను పరిశీలించారు. ఆయన వెంట నాయకులు ఆర్‌ఎంపీ వైద్యులు నర్సింహ, నాయకులు రియాజ్ తదితరులున్నారు.

సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలి


ఉపాధ్యాయులకు సభ్యత్వాన్ని అందజేస్తున్న కాశీరావు

శంకర్‌పల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కోట్ల కాశీరావు డిమాండ్ చేశారు. శంకర్‌పల్లి, మహాలింగపురం, పర్వేద, రావులపల్లి ఉన్నత పాఠశాలల్లో బుధవారం ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదును నిర్వమించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు జంగయ్య, శ్రీను పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

చౌదరిగూడ, జూలై 30(ఆంధజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పనులు కొనసాగుతున్నాయి. బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్ద ఎల్కిచర్లలో వనంపల్లి శ్రీనివాస్‌కు మంజూరైన ఇంటి స్లాబ్ పనులను ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు పరిశీలించారు. పనులను దగ్గరుంచి చేయించారు. మండలానికి మంజూరై 506 ఇండ్లలో 392 ఇండ్లు వివిధ దశల్లో ఉన్నాయని, 163 బేస్మెంట్ పనులు, పది ఇళ్ల గోడల వరకు నిర్మాణం అయ్యాయని ఎంపీడీవో తెలిపారు. కొందుర్గు మండలంలో 495 ఇండ్లకు 264 ఇళ్ల బేస్మెంట్ పనులు కొనసాగుతున్నాయని ఎంపీవో విజయ్‌కుమార్‌పాల్ తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట్‌నర్సింహారెడ్డి, లింగం గౌడ్, శ్రీను, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.


ఇంటి స్లాబ్ నిర్మాణానికి పూజ చేస్తున్న అధికారులు, నాయకులు ◄

బీఆర్ఎస్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యం

చేవెళ్ల, జూలై30(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బుధవారం ముడిమ్యాల్ గ్రామ జేఏపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 50మంది నాయకులు చేవెళ్ల మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సబితారెడ్డి నివాసానికి చేరుకొని ఆమె సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. నాయకులు, కార్యకర్తలకు సబితారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వారితో ఆమె మాట్లాడుతూ... రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. నాయకులకు, కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. స్థానిక ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణరెడ్డి, చేవెళ్ల మండల యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, నాయకులు శశిపాల్, శేరి రాజు, మాధవరెడ్డి, ఆరిఫ్ మియా, రాములు, రమేశ్, మోహన్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, అంజయ్య, రమేశ్, జైపాల్, నర్సింలు, మహేందర్, బద్రి పాల్గొన్నారు.


మాజీ మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు



పసుపు పంటను పరిశీలిస్తున్న అధికారులు

క్షేత్రాల్లో పంటల పరిశీలన

కొడంగల్ రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): టేకుల్‌కోడ్ గ్రామంలో రైతు గోవర్ధన్ సాగు చేసిన పసుపు, ఆయిల్‌పామ్ పంటలను బుధవారం మండల వ్యవసాయ అధికారి తులసి, వ్యవసాయ విస్తరణాధికారి దేవేందర్ పరిశీలించారు. రైతుకు పలు సూచనలు చేశారు. పసుపు పంటలో ఆకుమచ్చ తెగులు నివారణకు వాడాల్సిన మందులపై అవగాహన కల్పించారు.

బాలిక కిడ్నాప్

కూతురిని వెతికి అప్పగించాలని పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు

» నాలుగు రోజులైనా పట్టించుకోని పోలీసులు

బషీరాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఇంట్లోంచి తమ కూతురిని ఎవరో కిడ్నాప్ చేశారని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాలుగు రోజులుగా కూతురి ఆచూకీ లభించక తల్లిదండ్రులు ఆందోళన చెందుతు న్నారు. ఈ నేపథ్యంలో బుధవారం పోలీస్‌స్టేషన్ వద్ద బాలిక తల్లిదండ్రులు విలేకరుల వద్ద తమ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన దంపతుల కూతురు(15) ఏడో తరగతి వరకు చదివి ఇంటి వద్దే ఉంటోంది. ఈ నెల 23న ఇంట్లో నుంచి బాలిక కన్పించకుండా పోయింది. బయటి నుంచి ఇంటికొచ్చిన తల్లిదండ్రులకు కూతురు కన్పించలేదు. రెండు రోజుల పాటు తెలిసిన చోటల్లా వెతికారు. అయినా ఆచూకీ లభ్యం కాక 26న బషీరాబాద్ పోలీసులకు కూతురి అదృశ్యంపై ఫిర్యాదు చేశారు. ఓ యువకుడు, కూతురి ఫొటోలు బాలిక తండ్రి ఇన్‌స్టగ్రామ్, వాట్సాప్‌లలో కప్పించాయి. దీంతో ఆ యువకుడే బాలికను కిడ్నాప్ చేసి ఉంటాడని గుర్తించారు. అతడిది ఏ ఊరో తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాలుగు రోజులైనా పోలీసులు తమ కూతురి ఆచూకీ కనుక్కోకపోవడంతో మరోసారి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. తమ కూతురిని తమకు అప్పగించాలని ఎస్‌ఐతో కన్నీటి పర్యంతమయ్యారు. ఇదిలా ఉంటే అయితే సదరు యువకుడి కుటుంబీకులు బాలిక తండ్రికి ఫోన్ మాట్లాడుతూ.. 'మీరు కేసు పెడితే ఏం అవుతుంది. తాండూరుకొస్తే మట్లాడుకుందాం.' అని ఫోన్‌లో వాదనకు దిగారు. మైనర్ అయిన తన కూతురిని కిడ్నాప్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ నుమాన్ అలీ స్పందన కోరగా.. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

పరిగిలో ఖేలో ఇండియా శిక్షణ కేంద్రం

» కోచ్ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా శిక్షణ కేంద్రం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాలనుసారం ఖేలో ఇండియా, ఖోఖో శిక్షణ శిబిరం పరిగి కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఎంఏ సత్తార్ పేర్కొన్నారు. ఈ కేంద్రాన్ని నిర్వహించేందుకు పూర్తి స్థాయి కోచ్ అవసరం ఉందన్నారు. జాతీయ స్పోర్ట్స్ ఫెడరేషన్ వారి ద్వారా లేదా గుర్తింపు పొందిన సంస్థలు నిర్వహించిన జాతీయ స్థాయిలో సీనియర్ నేషనల్/ఖేల్ ఇండియా పోటీల్లో పతకాలు సాధించిన వారు, జాతీయ స్థాయిలో ఆల్ ఇండియా యూనివర్శిటీ పోటీలలో పతకాలు సాధించిన వారు అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న వారు ఈ కోచ్ పదవికి అర్హులన్నారు. అర్హులైన వారు ఆధార్ కార్డు ఫొటోకుల ధ్రువపత్రాలు స్పోర్ట్స్ పత్రాలు జత చేసి.. నేషనల్ స్పోర్ట్స్ రిజిష్టర్ నంబర్లతో జిల్లా యువజన క్రీడల అధికారికి ఆగస్టు 12లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9848395708, 9676638201 నంబర్లలో సంప్రదించాలన్నారు.



ప్రొసీడింగ్‌లను అందిస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి

ప్రభుత్వ పథకాలే గెలిపిస్తాయి

కులకచర్ల, జూలై 30(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వ పథకాలే కాంగ్రెస్ అభ్యర్థులను గెలుపునిస్తాయని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి అన్నారు. బుధవారం కులకచర్లలో ఇళ్ల లబ్ధిదారులకు స్థానిక నాయకులతో కలిసి ప్రొసీడింగ్‌లను అందించారు. ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమం, అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మాజీ ఎంపీటీసీ ఆనంద్, నాయకులు కృష్ణారెడ్డి, వెంకటేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఎల్లప్ప, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

ప్రభుత్వ భూములను కబ్జా నుంచి కాపాడాలి

» మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మేడ్చల్, జూలై 30(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ భూములను కబ్జా నుంచి కాపాడి ప్రజలకు ఉపయోగపడేలా పీహెచ్‌సీ సెంటర్లకు కేటాయించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన మల్కాజిగిరి ప్రజలతో కలెక్టరు మను చౌదరిని కలిసి పలు సమస్యలపై కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మల్కాజిగిరి నియోజకవర్గంలో ఎక్కడచూసినా భూముల కబ్జాలే జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గంలో డంప్ యార్డులు, శ్మశానవాటికల సమస్యలున్నాయని, యూపీఎస్‌సీ నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు మంజూరైనా భూమి కేటాయించడం లేదన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు, పార్కు స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయన్నారు. జీఓ59 ద్వారా డబ్బులు చెల్లించిన వారికి ఇంత వరకు రెగ్యులరైజేషన్ ప్రొసీడింగ్‌లు ఇవ్వలేదన్నారు. ఇటీవల జరిగిన దిశ సమావేశంలో పేర్కొన్న అంశాలను పరిగణలోకి తీసుకుని పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మల్కాజిగిరి నియోజకవర్గంకు చెందిన పలువురు నాయకులు, ప్రజలు ఉన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

కొడంగల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి ఏలోకి మార్చాలని ముదిరాజ్ సంఘం నియోజకవర్గ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రెడ్డి బసిరెడ్డి గార్డెన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని రంగాల్లో వెనుకబడిన ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. హామీలను అమలు చేయాలని కోరారు. త్వరలోనే సీఎంను కలిసి ముదిరాజ్‌లకు ప్రాధాన్యం కల్పించాలని కోరుతామని, ఆగస్టు 20న కొడంగల్‌లో ముదిరాజ్‌ల ఐక్యవేదిక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు వేణుగోపాల్, నర్సింహులు, సత్యపాల్, తుడుం శ్రీనివాస్, వెంకటయ్య, బాలయ్య, నారాయణ, వెంకటయ్య, యాదగిరి, బాబయ్యనాయుడు, హనుమంతు, మైపాల్, తిరుపతయ్య, వెంకటయ్య, గోపాల్, రాములు, నారాయణ, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

వినియోగదారులకు అందుబాటులో ఉండాలి

» టీజీఎస్పీడీసీఎల్ రంగారెడ్డి జోన్ సీఈ పాండ్య

హైదరాబాద్ సిటీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ ఉత్తమసేవలందించాలని దక్షిణ తెలంగాణ విద్యుత్‌పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) రంగారెడ్డి జోన్ చీఫ్ ఇంజనీర్(సీఈ) పాండ్య అధికారులను ఆదేశించారు. బుధవారం బస్తీబాటలో భాగంగా జనరల్ మేనేజర్ అంజయ్య, సైబర్‌సిటీ ఎస్ఈ చంద్రశేఖర్, డీఈ శ్యాంకుమార్‌లతో కలసి కొండాపూర్ డివిజన్ రాఘవేంద్రకాలనీ, గోల్డెన్ తులిప్, కొండాపూర్ ప్రాంతాల్లో పర్యటించారు. సీఈ మాట్లాడుతూ స్థానికంగా ఎలాంటి సమస్యలున్నా బస్తీబాట కార్యక్రమంలో తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. కాలనీఅసోషియేషన్లు, అపార్ట్‌మెంట్ల వాసులతో సిబ్బంది తరుచూ అందుబాటులో ఉంటారన్నారు.

వ్యాధుల కాలం.. అప్రమత్తత ముఖ్యం

» రోగాలు ప్రబలకుండా జాగ్రత్తలు తప్పనిసరి

» లక్షణాలుంటే వెంటనే వైద్యం చేయించుకోవాలి

చేవెళ్ల, జూలై 30(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉన్నందున కొన్ని నెలపాటు ప్రజలు ఆరోగ్య పరంగా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వానకాలంలో వ్యాధులు సోకే ఆస్కారం ఎక్కువని అంటున్నారు. ఆ తర్వాత వచ్చే చలికాలంలోనూ అప్రమత్తత అవసరమని డాక్టర్లు సూచిస్తున్నారు. వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటి ఆవరణ, రోడ్లపై మురుగు నీరు నిల్వ ఉండకుండా పంచాయతీలు, మునిసిపాలిటీలు చర్యలు చేపట్టాలి. మురుగు కాలవల్లో పేరుకునే పూడికను ఎప్పటికప్పుడు తీసేయించాలి. దోమలు వృద్ధి చెందకుండా చర్యలుచేపట్టాలి. దోమ కాటుతో పలు రకాల వ్యాధులొస్తాయి. దోమలు ఎక్కువ కుడితే ఫ్లూ, మలేరియా వ్యాధులొస్తాయి. జ్వరం, కండరాలు నొప్పులు, వాంతులు దద్దుర్లు వంటివి ఈ వ్యాధి లక్షణాలు. రక్తంలో ప్లేట్లెట్లు ఒక్కసారిగా పడిపోయి ప్రాణానికి ముప్పు వాటిల్లే ఆస్కారం ఉంటుంది. సాధారణ ఫ్లూ పట్ల ప్రజలు జాగ్రత్త పడాలి. పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి ఫ్లూ త్వరగా సోకుతుంది. జలుబు, దగ్గు, ఆయాసం, శక్తి కోల్పోవడం వంటి లక్షణాలు ప్రధానంగా కన్పిస్తాయి.

స్వైన్ ఫ్లూతో జాగ్రత్త

అక్టోబరు నుంచి మార్చి వరకు స్వైన్‌ఫ్లూ కేసులు ఎక్కువగా నమోదవుతుంటాయి. ఈ వైరస్ ప్రధానంగా శ్వాసకోశ వ్యవస్థపై దాడిచేస్తుందని వైద్యులు చెబుతున్నారు. అలాగే ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి వేగంగా సోకుతుంది. స్వైన్‌ఫ్లూ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వైరస్ లక్షణాలుంటే వెంటనే టెస్టులు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఇలా చేయాలి...

- నీటి నిల్వ గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయాలి. లార్వా దశలోనే దోమల వృద్ధిని అరికట్టాలి.



చేవెళ్లలోని భగత్‌సింగ్ కాలనీ రోడ్డుపై నిలిచిన నీరు

- మురుగు కాల్వ పూడిక, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి. కాల్వల్లో మందు పిచికారీ చేపట్టాలి
- ప్రధాన ఆవాస ప్రాంతాలు, అంతర్గత కాలనీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలి.
- వ్యాధులు ప్రబలే మురికివాడల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- ప్రత్యేక వైద్య, ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలి.

వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలి



వానకాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. జలుబు, జ్వరం వంటి లక్షణాలున్న వారు వెంటనే వైద్యం చేయించుకోవాలి. జాగ్రత్తలు పాటిస్తే సగం వ్యాధులను అరికట్టొచ్చు. అనారోగ్యానికి, వైరల్ వ్యాధులకు సంబంధించి ఏ చిన్న లక్షణాలు కన్పించినా వైద్యం చేయించుకోవాలి. ప్రభుత్వాస్పత్రుల్లో అన్ని రకాల వ్యాధులకు వైద్యం అందుబాటులో ఉంది.

- డాక్టర్ రాజేంద్రప్రసాద్, సూపరింటెండెంట్, చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రి



రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ప్రతీ పథకాన్ని పేదల గడపకు చేర్చాలి

» ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, జూలై 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ పథకాన్ని పేదల గడపకు చేర్చాల్సిన బాధ్యత అధికారులదేనని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నంలోని శాస్త్రా గార్డెన్స్‌లో ఆదిభట్ల, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలు, రూరల్ మండలానికి చెందిన 1,294 మందికి కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీల అమలుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వలేదని, ఇళ్లు నిర్మించి ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చి గత పాలకులు జేబులు నింపుకున్నారని విమర్శించారు. తాము పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ, రైతు భరోసాతో అమలుతో ఓర్వలేక ప్రతిపక్షాలు సోయితప్పి మాట్లాడుతున్నాయని మండిపడ్డారు. విపక్షాల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టి వాస్తవాలను ప్రచారం చేయాల్సిన బాధ్యత కార్యకర్తలదన్నారు. మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, తాగు నీరు వంటి వసతులు కల్పించేందుకు దశలవారీగా నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టామని, యంత్రాంగం కూడా ఎప్పటికప్పుడు తగు రీతిలో స్పందిస్తోందన్నారు. పంచాయతీల్లో కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారుల నుంచి పైస్థాయి అధికారుల వరకు సమన్వయంతో పనిచేయాలని, అప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్లు చిలుక మధుసూదన్‌రెడ్డి, కె.గురునాథ్‌రెడ్డి, తహసీల్దార్ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్లు బి.సత్యనారాయణరెడ్డి, బాలకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మంకాల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై అధికారుల సీరియస్

» పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుకు ఎంపీడీవో ఆదేశం



కార్యదర్శిని వివరాలు అడుగుతున్న ఎంపీడీవో

బషీరాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మైల్వార్‌లోని బృహత్ పల్లె ప్రకృతి వనం భూమి తమందంటూ కొందరు చెట్లు నరికివేయడంపై బషీరాబాద్ ఎంపీడీవో తిరుమలస్వామి బుధవారం స్పందించారు. సదరు వ్యక్తులపై పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టాలని పంచాయతీ కార్యదర్శి నర్సింహాగౌడ్‌ను ఆదేశించారు. మైల్వార్‌లో పదెకరాల్లోని బృహత్ ప్రకృతి వనం భూమి తమదని మెతుకు బసమ్మ చెట్లను నరికివేయించారు. ఆ భూమి రెవెన్యూ రికార్డులు సేకరించిన కార్యదర్శి వాటిని ఎంపీడీవో, ఎంపీవోలకు చూపించారు. సదరు పదెకరాలను రెవెన్యూ అధికారులు ప్రకృతి వనానికి అప్పగించిన డ్యాకుమెంట్లను అధికారులు పరిశీలించారు. అధికారులు, కార్యదర్శి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సదరు వ్యక్తులపై ఫిర్యాదు చేశారు. ఈ నెల 28నే పోలీసులకు ఫిర్యాదు చేశానని, ఆ భూమి పత్రాలు తేవాలని ఎస్‌ఐ సూచించారని కార్యదర్శి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బుధవారం కార్యదర్శి మరోసారి ఫిర్యాదు చేశారు.



పంచాయతీ భవనాన్ని పరిశీలిస్తున్న మానిటరింగ్ కమిటీ

అభివృద్ధి పనుల పరిశీలన

కొడంగల్ రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్నారం గ్రామంలో బుధవారం జాతీయ స్థాయి మానిటరింగ్ కమిటీ సభ్యులు పర్యటించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్లు, మొక్కల పెంపకం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, రోడ్ల వంటి పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులతో తీసుకున్న రుణాలను ఏవిధంగా చెల్లిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. పెన్షన్‌దారుతో మాట్లాడి జీవనోపాధికి డబ్బులు ఏవిధంగా ఖర్చు చేస్తున్నారో తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మానిటరింగ్ కమిటీ సభ్యులు జోసెఫ్, వినోద్, ఏపీడీ సరళ, ఎంపీడీవో ఉషశ్రీ, ఎంపీవో జైపాల్ రెడ్డి, ఏపీవో రాములు, పీఆర్ ఏఈ రవికిరణ్ రెడ్డి, పంచామతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

ప్రజాసేవకు యువత రాజకీయాల్లోకి రావాలి

ఆమనగల్లు, జూలై 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ వేదికగా యువత ప్రజాసేవ చేయడానికి రాజకీయాల్లోకి రావాలని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ పిలుపు నిచ్చారు. స్థానిక సంస్థల్లో యువతకు కాంగ్రెస్ అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లాస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాంగ్రెస్ యువతకు రాజకీయ అవకాశాలు కల్పిస్తుందన్నారు. పంచాయతీ రాజ్ చట్టం గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. విపక్షాల కుట్రలను, విష ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 19నెలల్లో ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గం అన్ని రంగాల్లో ప్రగతి సాధించిందన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, విజయ్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బిక్యానాయక్, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, డోకూరు ప్రభాకర్‌రెడ్డి, జగన్, మానయ్య, కిషన్‌రెడ్డి, బీచ్యనాయక్, మోతీలాల్, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణనాయక్, వెంకటేశ్, వెంకటరమణారెడ్డి, ఫరీద్, శ్రీకాంత్, శ్రీశైలం, హీరాసింగ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీ పండిత్

సమస్యలపై నిర్మాణాత్మక పోరాటాలు చేయాలి

తాండూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఈ ప్రాంత సమస్యలపై నిర్మాణాత్మక పోరాటాలను చేసేందుకు ప్రణాళికలను రూపొందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీ పండిత్ చెప్పారు. బుధవారం తాండూరులో పట్టణ, మండల మహా సభల్లో ఆమె ప్రసంగించారు. రాజకీయాల దృష్ట్యా మనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల పక్షాన నిలబడే బాధ్యత మనకుందని వివరించారు. వికారాబాద్ ప్రాంత సమస్యలను సీపీఐ ఎమ్మెల్యే అసెంబ్లీలో లేవనెత్తారని గుర్తుచేశారు. ప్రజా సంఘాల నిర్మాణం సరిగ్గా ఉంటే పార్టీ బలంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రవీందర్, పార్టీ మండల కార్యదర్శి దస్తప్ప, పట్టణ కార్యదర్శి మునీర్, లక్ష్మణ్, దస్తప్ప, విజయ్, రాజేందర్, దశరథ్‌గౌడ్, మినాజుద్దీన్, అశోక్, విజయలక్ష్మి, దేవి, జగదాంబ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గాల ఏర్పాటు

తాండూరు పట్టణ నూతన కార్యదర్శిగా మునీర్ అహ్మద్, సభ్యులుగా ఇమ్రాన్, నసీమా బేగం, జగదాంబ, విజయ్, రాజేందర్, మండల కార్యదర్శిగా యాదప్ప, సహాయ కార్యదర్శిగా రాజు, కార్యవర్గ సభ్యులు దస్తప్ప, లక్ష్మణ్, చంద్రమ్మ, శివ, గోపాల్‌రెడ్డిలు ఎన్నికయ్యారు.

కాంగ్రెస్ పాలనతో గ్రామాల్లో ప్రగతి కాంతులు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూలై 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రగతి కాంతులు, పేదల జీవితాల్లో వెలుగులు నిండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తమకు సామాజిక న్యాయం జరుగుతోందన్నా సంతోషం ప్రజల్లో వ్యక్తమవుతుందని చెప్పారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో బుధవారం ఎమ్మెల్యే నారాయణరెడ్డి పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆమనగల్లులో జాతీయ రహదారి రాజీవ్ చౌక్ నుంచి సందబావి వరకు రూ.5కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. కడ్తాల మండల పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. శెట్టిపల్లిలో ఇటీవల చనిపోయిన కొమ్ము లక్ష్మమ్మ సంతాప కార్యక్రమంలో పాల్గొని ఆమె కుటుంబానికి రూ.5వేల సాయం అందజేశారు. మాడ్గుల మండలానికి మంజూరైన 670 రేషన్ కార్డులను, 10 కల్యాణలక్ష్మి చెక్కులను ఆమనగల్లు మార్కెట్ మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి, తహసీల్దార్ వినయ్ సాగర్‌లతో కలిసి అందజేశారు. ఆయా చోట్ల జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద కుటుంబాల సంక్షేమమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమన్నారు. ఇందుకు అనేక పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం, విస్తరణకు కార్యాచరణ అమలు చేస్తున్నట్లు కసిరెడ్డి తెలిపారు. ప్రధాన రూట్లలో రద్దీకి అనుగుణంగా కొత్త బస్సు సర్వీసులను వేస్తున్నట్లు చెప్పారు. పదేళ్ల తర్వాత పేదలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమాల్లో నాయకులు లక్పతినాయక్, ఎగిరిశెట్టి సత్యం, సూదిని కొండల్‌రెడ్డి, జంగయ్య, యాదయ్యగౌడ్, ఇటిక్యాల విజయమ్మ, వెంకట్‌రెడ్డి, జగన్, పాండు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బాబా, తాళ్ల రవీందర్, బొజ్జ సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆలయ నిర్మాణానికి సహకరిస్తా

సన్మార్గంతోనే దైవానుగ్రహం లభిస్తుందని ఎమ్మెల్యే నారాయణ రెడ్డి అన్నారు. ఆవురుపల్లిలోని నల్లవారిపల్లి రోడ్డులో ఉన్న కంఠమహేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ప్రభుత్వ పరంగా సహకరిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఆలయంలో పూజలు చేశారు. ఎమ్మెల్యేను ఆలయ కమిటీ చైర్మన్ బాలమోని రవికుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు నర్సింహాగౌడ్, శ్రీనివాస్ గౌడ్, జీవీ.గౌడ్, నిరంజన్‌గౌడ్, వెంకటయ్య గౌడ్, కృష్ణయ్యగౌడ్, చిన్న నర్సింహాగౌడ్, శ్రీశైలంగౌడ్ తదితరులు ఉన్నారు.

లబ్ధిదారులను లంచం అడిగితే ఇంటికే..

మాడ్గుల: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎవరైనా డబ్బులు అడిగితే వారిపై చర్యలు తీసుకుంటామని, డబ్బు డిమాండ్ చేస్తే వారిని డిస్మిస్ చేస్తామని ఎమ్మెల్యే నారాయణరెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొత్తగా 670 రేషన్‌కార్డులు, పాత కార్డుల్లో 2,300 మంది కుటుంబీకుల పేర్లను కొత్తగా చేర్చినట్టు తెలిపారు. కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కొందరు లబ్ధిదారుల ఫిర్యాదుతో ఎమ్మెల్యే స్పందిస్తూ.. 'మీకు ఇల్లు మంజూరైంది. మాకు ఏమీ లేదా?' అని కొందరు లబ్ధిదారులను డబ్బు అడుగుతున్నట్టు తన దృష్టికి వచ్చిందని, ఉద్యోగులు పేదలను డబ్బు డిమాండ్ చేయడం ఏమిటని ఎమ్మెల్యే. ఇన్‌చార్జి ఎంపీడీవో వేజన్నను నిలదీశారు. ఎవరైనా లంచం తీసుకుంటే ఉద్యోగం ఊడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వినయ్‌సాగర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భట్టు కిషన్ రెడ్డి, నాయకులు సూదిని కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయిరెడ్డి, పాండుగౌడ్, మాజీ ఎంపీపీ జంగయ్య, యాదయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఆదిభట్ల సీఐగా రవికుమార్ బాధ్యతల స్వీకరణ



ఆదిభట్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల సీఐగా బి.రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సీఐ రాఘవేందర్‌రెడ్డి పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో రవికుమార్ ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలతో కలిసి పని చేస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి యత్నిస్తామన్నారు.

హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ సీఐగా సత్యనారాయణ..



యాచారం, జూలై 30(ఆంధ్ర జ్యోతి): హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐగా సత్యనారాయణ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈయన సైబర్‌క్రైం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ లిక్కి కృష్ణంరాజు సైబర్‌క్రైం సీఐగా బదిలీపై వెళ్లారు. కాగా, సత్యనారాయణ ఇబ్రహీంపట్నం సీఐగా గతంలో పనిచేశారు.

అధ్వానంగా ఆఫీసులు!

(ఐదో పేజీ తరువాయి)

ప్రతిపాదనలు పంపుతున్నా వీటికి మోక్షం లభించడం లేదు.



స్లాబ్ వేశాక నిలిచిన మున్సిపల్ భవనం

56 ఏళ్లుగా అద్దె భవనంలోనే..

ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పట్టణంలోని రాయపోల్ వెళ్లే దారిలో 56 ఏళ్లుగా అద్దె భవనంలోని ఇరుకు గదుల్లో కొనసాగుతోంది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా ఆదాయం ఎంతొస్తుందని లెక్కలు కడుతున్నారేకాని కార్యాలయానికి పక్కా భవనం నిర్మించాలనే ధ్యాస పాలకులకు లేదు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే జనం ఎండనక వాననక ఆరుబయట వేచి ఉండాల్సిందే. కనీసం నిల్చుందామన్న జాగా లేదు. వసతులు లేక జనం ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఆ దారి వెంట వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలకు రూ.2050 అద్దె చెల్లిస్తున్నారంటే ఈ భవనం పరిస్థితి ఎలా ఉందో చేసుకోవచ్చు. నూతన భవన నిర్మాణం కోసం 2016లో అప్పటి ప్రభుత్వం రూ.63 లక్షల నిధులు మంజూరు చేసింది. స్థల ఎంపికలో జరిగిన జాప్యం కారణంగా ఆ నిధులు వెనక్కి వెళ్లాయి. పాత పోలీస్ స్టేషన్ స్థలంలో 810 గజాల స్థలం కార్యాలయం కోసం కేటాయిస్తున్నట్లు ప్రకటించి ప్లాన్ సిద్ధం చేసినా నిర్మాణం చేపట్టలేదు. ఆ తర్వాత ఈ స్థలాన్ని మిషన్ భగీరథ శాఖకు కేటాయించడంతో ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణం చేశారు. ఇదిలా ఉండగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాన్ని తామే నిర్మించి అద్దె ప్రాతిపదిక ఇస్తామని మున్సిపల్ శాఖ ముందుకొచ్చింది. డీఎంఎఫ్‌టీ నిధులు రూ.1.50 కోట్లతో 2022 ఫిబ్రవరి 9న భవనం పనులు ప్రారంభించినా అది స్లాబుల మధ్యే నిలిచిపోయింది.

శిథిలావస్థలో ఎక్సైజ్ కార్యాలయం

మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న శిథిలమైన అద్దె భవనంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ కార్యాలయం కొనసాగుతోంది. కనీసం ఫైళ్లు భద్రపరిచేందుకు కూడా వీలు లేకుండా ఉంది. తహసీల్దారు కార్యాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఎక్సైజ్ కార్యాలయం నూతన భవన నిర్మాణం కోసం ప్రతిపాదించినా అది కొలిక్కి రాలేదు. దీంతో అక్కడ పంచాయతీరాజ్ అతిథి గృహాన్ని నిర్మించారు. ఆ తర్వాత వినోభానగర్‌లోని భూదాన్ భూముల్లో స్థల పరిశీలన చేసి ప్రతిపాదలు పంపినా అతీగతి లేదు. 2017 ఏప్రిల్ మాసంలో సర్వే నంబర్ 1444లో 450 గజాల స్థలాన్ని కేటాయిస్తున్నట్లు మరో ప్రతిపాదన వెలువడింది. అయినా నేటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత కార్యాలయం నడుస్తున్న అద్దె భవనం బూత్ బంగ్లాను తలపిస్తోంది. అది వర్షాలకు ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ భవనానికి నెలకు ఏడు వేల రూపాయలు అద్దె చెల్లిస్తున్నారు. 2017 ఏప్రిల్‌లో 450 స్థలం కేటాయించాలంటూ ఆర్డీవో, తహసీల్దారులకు ఎక్సైజ్ అధికారులు మరో ప్రతిపాదన పంపారు. ఇది పరిశీలనలో ఉంది. ఇదిలా ఉండగా సహాయ కార్మిక అధికారి కార్యాలయం ఇబ్రహీంపట్నం టౌన్ మంచాల రోడ్డులో రెండు గదులున్న ఇరుకు భవనంలో నడుస్తోంది. దీనికి పక్కా భవనం ప్లానింగ్ కూడా లేదు.

ప్రతిపాదనలు పంపాం



ఎక్సైజ్ కార్యాలయం నూతన భవనం కోసం ఉన్నతాధికారులకు ప్రతాపాదనలు పంపి ఫాలోఅప్ చేస్తున్నాం. ప్రస్తుతం కార్యాలయ భవనం శిథిలావస్థలో ఉంది. సిబ్బంది కూర్చోవడానికి కూడా ఇబ్బందిగా ఉంది. ఏదైనా కేసులో నిందితులను విచారించాలన్నా అవస్థగా ఉంది..

- సీతారాంరెడ్డి, ఎక్సైజ్ సీఐ ఇబ్రహీంపట్నం

క్రైం కార్నర్

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ

● త్రుటిలో తప్పిన ప్రమాదం

ఆమనగల్లు, జూలై 30(ఆంధ్రజ్యోతి): రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్న ఘటన ఆమనగల్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి అచ్చంపేటకు ఆర్టీసీ బస్సు వెళుతోంది. ఈక్రమంలో సంతోష్ నగర్ నుంచి చిన్న ఆదిరాలకు మరో ఆర్టీసీ బస్సు వెళుతోంది. ఈక్రమంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట టిప్పర్ లారీ యూటర్న్ తీసుకుంటున్న సమయంలో ముందు వెళ్తున్న చిన్న ఆదిరాల బస్సు డ్రైవర్ సడెన్‌బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న అచ్చంపేట బస్సు ఢీకొనడంతో బస్సు స్వల్పంగా దెబ్బతినగా త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. దాంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ దుర్మరణం



ట్రాక్టర్ కింద ఆంజనేయుల మృతదేహం

తలకొండపల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తాపడటంతో డ్రైవర్ దుర్మరణం పాలైన ఘటన మండలంలోని జూలపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ కథనం మేరకు.. జూలపల్లికి చెందిన ఆంజనేయులు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గ్రామ సమీపంలో వ్యవసాయం పొలం దున్నడానికి ఇద్దరు స్నేహితులతో కలిసి ట్రాక్టర్‌పై బయలుదేరాడు. ఈక్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. దాంతో ఆంజనేయులు ట్రాక్టర్ కిందపడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా ఇద్దరు స్నేహితులు పక్కకు దూకడంతో స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి వివరాలు సేకరించి కుటుంబికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

కొత్తూర్, జూలై 30(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు గాయపడిన ఘటన కొత్తూర్ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. పెంజర్ల గ్రామానికి చెందిన శేఖర్‌రెడ్డి(52) ఆయన భార్య పద్మ(45) పెంజర్ల గ్రామం నుంచి బైక్‌పై హైదరాబాద్ కు బయలుదేరారు. కొత్తూర్ బైపాస్ చౌరస్తా వద్ద కారు ఢీకొనడంతో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు శంషాబాద్‌లోనే ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. క్షతగాత్రుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కొత్తూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కార్మికుడి కుటుంబానికి పరిహారం చెల్లించాలి



ప్రమాదం జరిగిన తీరును తెలుసుకుంటున్న దేవేందర్

శంకర్‌పల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): భవనంపై నుంచి కిందపడి మృతి చెందిన కార్మికుడు సంతోష్ కుటుంబానికి పరిహారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్ డిమాండ్ చేశారు. శంకర్‌పల్లిలో బుధవారం ఆయన విలేకులతో మాట్లాడుతూ వీవీఆర్ డెవలపర్స్ నిర్మిస్తున్న 6 అంతస్తుల భవనంపై నుంచి కార్మికుడు పడి చనిపోయాడని, ముందస్తు భద్రతా చర్యలు తీసుకోని కారణంగానే కార్మికుడు మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు హెల్మెట్‌లు, బెల్ట్, షూ లాంటివి లేకుంగానే పనులు చేయించడంతో ప్రమాదాలు జరుగుచున్నాయని ఆయన ఆరోపించారు. ఈమేరకు ఆయన ప్రమాదం జరిగిన తీరును కార్మికులను అడిగి తెలుసుకున్నారు. వీవీఆర్ డెవలపర్స్ యాజమాన్యంపై కార్మికశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రామాల అభివృద్ధికి సబితారెడ్డి చొరవ



పనులను పరిశీలిస్తున్న శ్రీనివాస్

కందుకూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా గ్రామాల అభివృద్ధికి మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పెద్దపీట వేస్తున్నట్లు బాచుపల్లి మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్ అన్నారు. ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి చొరవతో గ్రామంలోని కేకే బస్తీలో సీసీ రోడ్డు పనులకు మంజూరు చేసిన రూ.10లక్షల నిధులతో చేపట్టిన పనులను బుధవారం కాలనీ వాసులతో ఆయన పరిశీలించారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులు చేపట్టాలి



కొందుర్గులో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించే స్థలం వద్ద బీజేపీ నాయకులు

చౌదరిగూడ, జూలై 30(ఆంధజ్యోతి): మండల కేంద్రంలో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని బీజేపీ కొందుర్గు మండలాధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, బోయ శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం కొందుర్గు మండల కేంద్రంలోని పాఠశాల నిర్మాణం కోసం సీఎం రేవంత్‌రెడ్డి చేసిన శంకుస్థాపన స్థలాన్ని వారు పరిశీలించారు. ఏడాది దాటినా పాఠశాల నిర్మాణ పనుల్లో పురోగతి లేకపోవడం, అసలు పాఠశాల నిర్మాణం ప్రారంభం అవుతుందా? అనే ప్రశ్న ప్రజల్లో ఉత్పన్నమవుతుందని వారు అన్నారు. కొందుర్గులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పనులు వెంటనే ప్రారంభించి ప్రజాప్రతినిధులు ప్రజలకు సమాధానం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బల్వంత్‌రెడ్డి, శివారెడ్డి, బోయ అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

చౌదరిగూడ, జూలై 30(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యమని బీజేపీ కొందుర్గు మండలాధ్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం కొందుర్గు మండల పరిధిలోని మూట్పూర్‌లో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడు కృష్ణయ్య ఆధ్వర్యంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ గ్రామ గ్రామాన బీజేపీని బలోపేతం చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోటీకి సిద్ధం కావాలని ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోయ శంకర్, బల్వంత్‌రెడ్డి, శివారెడ్డి, అశోక్, భాస్కర్, రాంచందర్, శివకుమార్, ఆగమయ్య, విక్రం రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

తగ్గనున్న దూరం.. తీరనున్న కష్టం!

(ఐదో పేజీ తరువాయి)

ఎగుమతి అవుతున్నాయి. అజీజ్‌నగర్‌లో సమీకృత మార్కెట్ నిర్మాణం జరిగితే మహబూబ్‌నగర్ జిల్లా నుంచి రంగారెడ్డి జిల్లాలో కలిసిన షాద్‌నగర్, కొత్తూరు, చౌదరిగూడ, కొందుర్గు, నందిగామ, కేశంపేట్ మండలాల రైతులకూ సౌకర్యవంతంగా ఉండనుంది.

అనేక రకాల కూరగాయలు, పూలు, పండ్ల తోటలు

పశ్చిమ రంగారెడ్డి జిల్లా పరిధిలో పాలకూర, చుక్కకూర, పొనగంటి కూర, మెంతికూర, గోంగూర, తోటకూర, పాలకూర చిక్కుడు, గోకర, కాకర, క్యాబేజీ, కాలీఫ్లవర్, క్యారెట్, కొత్తిమీర, పుదీన తదితర పంటలు పండిస్తున్నారు. అలాగే బంతి, చామంతి పూలు, జామ, మామిడి ఎక్కువగా సాగు చేస్తున్నారు. వీటిని హోల్‌సేల్ మార్కెట్ అయిన గుడిమల్కాపూర్‌కు తరలిస్తున్నారు. ఈ మార్కెట్ పశ్చిమ రంగారెడ్డి జిల్లా రైతులకు దూరంగా ఉండటంతో రవాణా ఖర్చులు పెరుగుతున్నాయి. దీనికి తోడు దళారుల బెడద, పార్కింగ్ సమస్య ఎక్కువగా ఉంది.

రైతులు, దళారుల మధ్య తరుచూ గొడవలు

గుడిమల్కాపూర్ హోల్‌సేల్ మార్కెట్‌లో రైతులకు, దళారుల మధ్య గొడవలు జరుగుతూనే ఉన్నాయి. గతంలో చేవెళ్ల రైతులపై కేసులు నమోదైన ఘటనలు కూడా ఉన్నాయి. చేవెళ్ల మండలం దేవుని ఎర్రవల్లి గ్రామంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమానికి వచ్చిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే కాలె యాదయ్యకు రైతులు వారి సమస్యలను విన్నవించారు. రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి తనపై రైతులపై నమోదైన కేసుల విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గుడిమల్కాపూర్‌లోని హోల్‌సేల్ మార్కెట్ నగరంలో ఉండటంతో పార్కింగ్, రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను దృష్టిలో ఉంచుకుని గుడిమల్కాపూర్ మార్కెట్‌ను మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ తరలించాలని నిర్ణయించారు. సర్వే నంబర్ 176లో సుమారు 220 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 150 ఎకరాల్లో సమీకృత మార్కెట్‌ను నిర్మించనున్నారు. ఇటీవల రెవెన్యూ అధికారులు మార్కెట్‌కు అవసరమైన భూములను పరిశీలించారు. త్వరలోనే హద్దురాళ్లు పాతి మార్కెటింగ్ శాఖకు అప్పగించే ప్రక్రియ కొనసాగుతోంది.

ప్రక్రియ కొనసాగుతోంది



గుడిమల్కాపూర్ మార్కెట్‌ను అజీజ్‌నగర్‌కు తరలించే ప్రక్రియ కొనసాగుతోంది. దీని కోసం రెవెన్యూ అధికారులు 150 ఎకరాలు కేటాయించారు. ఇందులో పూలు, పండ్లు, కూరగాయల మార్కెట్లను వేర్వేరుగా 50 ఎకరాల చొప్పున నిర్మించనున్నారు. రెవెన్యూ అధికారులు సేకరించిన భూమిని మార్కెటింగ్ శాఖకు త్వరలో అప్పగించనున్నారు. తర్వాత ఇంజినీరింగ్ అధికారులు ఖర్చు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించనున్నారు.

- రియాజ్, మార్కెటింగ్‌శాఖ జిల్లా అధికారి

దూరాభారం తగ్గుతుంది



సమీపంలో సమీకృత మార్కెట్ ఏర్పాటు చేస్తే దూరం తగ్గి రవాణా ఖర్చులు మిగులుతాయి. ఎంతో కష్టపడి పంట పండిస్తే.. మార్కెట్‌కు తరలించేందుకు ఎంతో కష్టతరంగా ఉంటుంది. గుడిమల్కాపూర్ మార్కెట్‌కు వెళ్లి పూలు, పండ్లు, కూరగాయలు అమ్ముకోవాలంటే.. దళారుల బెడద ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ నిర్మాణం జరిగితే దళారుల బెడద తప్పుతుంది.

- కుమ్మరి ఈశ్వరయ్య, హిమాయత్‌నగర్

త్వరగా నిర్మించాలి



గుడిమల్కాపూర్ మార్కెట్‌ను ఔటర్ రింగ్ రోడ్డు సమీపానికి తరలించేందుకు తీసుకున్న ప్రభుత్వ నిర్ణయం మంచిదే. కానీ.. త్వరగా నిర్మాణం చేపట్టి రైతులకు అందుబాటులో వచ్చేలా చర్యలు తీసుకోవాలి. రెవెన్యూ అధికారులు సేకరించిన 150 ఎకరాల భూమిని మార్కెటింగ్ శాఖకు అప్పగించాలి. మార్కెట్ నిర్మాణానికి అవసరమైన నిధులు వెంటనే మంజూరు చేసి పనులు ప్రారంభించాలి.

- కాసుల సుభాన్‌గౌడ్, టీడీపీ కార్యనిర్వాక కార్యదర్శి

న్యాయం చేయండి సారూ!

● భూమి విషయంలో తహసీల్దార్‌కు బాధితుల ఫిర్యాదు



శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద పత్రాలతో బాధితులు

శంకర్‌పల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమకిచ్చిన భూమిలోకి ఓ వ్యక్తి రానీయడం లేదని పొన్నగుట్టతండాకు చెందిన కిషన్, శంకర్, రామ్‌సింగ్, అమ్రియాలు బుధవారం శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్‌కు ఫిర్యాదు చేశారు. మోకిలలోని సర్వేనెంబర్ 96/130లో పట్టానెంబర్ 560, 561, 562, 563లలో 4.01 ఎకరాలను ప్రభుత్వం వ్యవసాయం చేసుకునేందుకు 1967లో అసైన్డ్ భూమి కింద ఇచ్చిందన్నారు. కొన్నాళ్ల క్రితం తమ తండ్రి వాల్యా మృతి చెందడంతో ఆ భూమిని నలుగురు కుమారులమైన తాము సాగు చేసుకుంటున్నామని వివరించారు. కొన్ని నెలల క్రితం నుంచి మోకిల తండాకు చెందిన ఓ వ్యక్తి తమను బెదిరింపులకు గురిచేస్తూ పొలంలోకి రానీయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తమకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా వేడుకున్నారు. తహసీల్దార్ సురేందర్‌ను వివరణ కోరగా విచారణ చేసి న్యాయం చేస్తామని తెలిపారు.

సీపీఐ మహాసభను విజయవంతం చేద్దాం



మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

షాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా మహాసభను విజయవంతం చేద్దామని మండల కన్వీనర్ పాలమాకుల శ్రీశైలం కోరారు. ఈమేరకు బుధవారం షాబాద్‌లో పార్టీ నాయకులతో కలిసి మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆగస్టు 2న మొయినాబాద్ మండల కేంద్రంలోని అంజనాదేవి గార్డెన్‌లో జిల్లా 17వ మహాసభను నిర్వహిస్తున్నామని, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, పార్టీ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్యలు హాజరవుతున్నారని తెలిపారు. నాయకులు, కారకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. మండల మాజీ కార్యదర్శి జంగయ్య, కౌన్సిల్ సభ్యులు రఘురాం, మధు, నారాయణ, రుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి/మాడ్గుల, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో పలువురు నిరుపేద కుటుంబాలకు ఇళ్ల నిర్మాణానికి బుధవారం మెటీరియల్‌ను సమకూర్చగా నాయకులు, ట్రస్ట్‌సభ్యులు వాటిని పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ లలితా జ్యోతయ్య, శేఖర్‌యాదవ్, ఇమ్రాన్, తదితరులున్నారు. మాడ్గుల మండలం గిరి కొత్తపల్లికి చెందిన పోలె శ్రీకాంత్ ఇంటి నిర్మాణానికి ఉప్పల వెంకటేష్ అనచరుల ద్వారా 50 బస్తాల సిమెంటును సమకూర్చగా సభ్యులు అందజేశారు.

ప్రజాసేవతో సమాజంలో గుర్తింపు



సుదర్శన్‌చారి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కేఎల్లార్

కందుకూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రజాసేవతో నాయకులకు సమాజంలో గుర్తింపు వస్తుందని, బాచుపల్లి మాజీ సర్పంచ్ సుదర్శన్ చారి గ్రామానికి ఎనలేని సేవ చేశారని, ప్రజల్లో, కాంగ్రెస్ పార్టీలోను ఆయనకు మంచి గుర్తింపు ఉందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఏడాదిక్రితం అనారోగ్యంతో సుదర్శన్‌చారి మృతిచెందాడు. ఈమేరకు గ్రామంలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని సుదర్శన్‌చారి కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం కేఎల్లార్ ఆవిష్కరించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి జంగారెడ్డి, మహేశ్వరం ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, నాయకులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఇ.రాకేష్‌గౌడ్, కృష్ణ, యుగేందర్‌రెడ్డి, వెంకటేష్, బి.పాండురంగారెడ్డి, శ్రీశైలం, ఎండీ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత ఉండొద్దు



మాట్లాడుతున్న అశోక్‌గౌడ్

తలకొండపల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటల సాగుకు ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గౌడ సంఘం నియోజకవర్గ కన్వీనర్ మొకురాల అశోక్‌గౌడ్ కోరారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లిలో బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గతంలో మాదిరిగా గట్టిప్పలపల్లిలో పీఏసీఎస్ గోదాం వద్ద యూరియా, డీఏపీ ఎరువులు నిల్వ ఉంచి పంపిణీ చేయాలని కోరారు. గతంలో గోదాం వద్దే రైతులకు ఎరువులు సరఫరా చేసేదని, దీంతో ఇబ్బందులు ఉండేది కాదన్నారు. ప్రస్తుతం గోదాం వద్ద ఎందుకు ఎరువులు పంపిణీ చేయడం లేదని అశోక్‌గౌడ్ ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు.

పాత పెన్షన్ విధానం అమలుపై హైకోర్టు తీర్పు చరిత్రాత్మకం

కడ్తాల్/చేవెళ్ల, జూలై 30(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ -2003 ఉపాధ్యాయుల పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని టీఎస్‌యూటీఎఫ్ కడ్తాల మండలాధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి శంకర్‌లు అన్నారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో బుధవారం కడ్తాల మండల కేంద్రంలో యూటీఎఫ్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. పాత పెన్షన్ అమలుకు యూటీఎఫ్ అనేక పోరాటాలు సాగించిందని పేర్కొన్నారు. అలాగే పాత పెన్షన్ వర్తింపజేయాలని తెలంగాణ హైకోర్టు తీర్పునివ్వడం హర్షణీయమని డీఎస్సీ -2003 పాత పెన్షన్ పోరాట సమితి పూర్వ అధ్యక్షుడు గణపురం సురధీర్ తెలిపారు. 2004 ఆగస్టు 31 వరకు అమల్లో ఉన్న పాత పెన్షన్ పథకాన్ని డీఎస్సీ-2003 నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు అమలు చేయకపోవడం చట్టవిరుద్ధమని, వారికి 2004 సెప్టెంబరు 1 నుంచి అమలులోకి వచ్చిన కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం అమలు చెల్లదని మంగళవారం హైకోర్టు పేర్కొందన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

షాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి) : షాబాద్‌లోని ఎస్సీ, బీసీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ బర్ల శ్రీకాంత్ అన్నారు. ఈమేరకు బుధవారం షాబాద్‌లో బీసీ, ఎస్సీ హాస్టల్‌ను ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వసతి గృహంలో మరుగుదొడ్లు, తాగునీటి సమస్య ఉందని, వార్డెన్స్‌తో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మధుకిరణ్, అజయ్, భారత్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవల్లో లయన్స్‌క్లబ్‌కు అంతర్జాతీయ ఖ్యాతి



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మహేంద్రకుమార్‌రెడ్డి

కడ్తాల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవల్లో లయన్స్‌క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో అగ్రభాగంలో నిలిచిందని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ మహేంద్రకుమార్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం లయన్స్ క్లబ్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డితో కలిసి మహేంద్ర కుమార్ రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సేవలను ఆయన కొనియాడారు. లయన్స్‌క్లబ్ జిల్లా క్యాబినెట్ కార్యదర్శి తాళ్ల అంజయ్య, జోన్ చైర్మన్ లింగయ్య, క్లబ్ కార్యదర్శి గంప శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఆమనగల్లు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధి పథకాలతో ఆర్థికంగా రాణించాలని లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు, సంఘ సేవకుడు పాపిశెట్టి రాము అన్నారు. ఆమనగల్లు పట్టణంలో పద్మ భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకున్న స్వయం ఉపాధి పథకాన్ని బుధవారం రాము ప్రారంభించారు. బైకని శ్రీశైలం యాదవ్, పూలశ్రీను, భాస్కర్, శ్రీను నాయక్, తారాసింగ్, భూపతి, రమేశ్, గోపి, ఆనంద్, తదితరులున్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం అవసరమైతే ఆమరణ నిరహార దీక్ష ప్రారంభిస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామనిన్నారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు మంగళవారం 270 వ రోజుకు చేరాయి. దీక్షల్లో జేఏసీ నాయకులు, యువకులు, వివిధ పార్టీల నేతలు, మెదక్‌పల్లి, వెంకట్రావ్‌పేట, బొమ్మరాశిపల్లి గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీక్షలకు మద్దతుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

యువత సన్మార్గంలో నడవాలి



రాజు కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేస్తున్న గోలి శ్రీనివాస్ రెడ్డి

ఆమనగల్లు, జూలై 30(ఆంధ్రజ్యోతి): యువత సన్మార్గంతో ముందుకు సాగుతూ తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తొందరపాటు నిర్ణయాలు, చెడు మార్గంతో యువత తప్పు దారుల ద్వారా కుటుంబాలలో విషాదం నింపొద్దని సూచించారు. కడ్తాల మండల కేంద్రంలో గతేడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తుప్పరి రాజు సంస్మరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గోలి శ్రీనివాస్ రెడ్డి, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్ నాయక్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాజు కుటుంబ సభ్యులతో కలిసి కేక్‌కట్ చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి, సురమల్ల సుభాష్, శ్రీకాంత్, సుమన్‌నాయక్, కృష్ణ, మణికంఠ, నవీన్, రాజశేఖర్, నరేశ్, శంకర్, శివ, సోను, కిషన్, కరుణాకర్, అబ్బాస్, ప్రశాంత్, శివ, రాజు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఈవీ చార్జింగ్ స్టేషన్ ప్రారంభం



స్టేషన్‌ను ప్రారంభిస్తున్న కేఎస్ రత్నం

చేవెళ్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల పట్టణ కేంద్రంలో వాహనదారుల కోసం ఈవీ చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. బుధవారం బీజేపీ నాయకులు డాక్టర్ మాల్గారి వైభవ్‌రెడ్డి, కొత్తకాపు రామకృష్ణరెడ్డిలు చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని కేసారం గేట్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈవీ చార్జింగ్ స్టేషన్‌ను మాజీ ఎంపీపీ విజయలక్ష్మి రమణారెడ్డిలతో కలిసి రత్నం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ భాస్కర్‌రెడ్డి, బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ అధ్యక్షుడు పాండురంగారెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకటేశ్, ఇంద్రసేనరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.